


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 06-01-2026 | సంపుటి - 26 | సంచిక -230 | రూ : 4 | పేజీలు: 8


## ఈ నెల 18న...

# మేడారంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- జనవరి 28 నుంచి 31 వరకు మేడారం మహా జాతర
- ఈ నెల 19న మేడారం గద్దెల పునరుద్ధరణ
- రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గద్దెల పునరుద్ధరణ






2లో

## వంతెనపై పగుళ్లు.. బీహార్‌లో నిలిచిపోయిన

# ప్రపంచంలోనే అతిపెద్ద శివలింగం తరలింపు

- గండక్ నదిపై ఉన్న వంతెన బలహీనంగా ఉండటమే ప్రధాన కారణం
- 210 టన్నుల శివలింగం, 160 టన్నుల ట్రైలర్‌తో పెరిగిన ప్రమాదం
- ప్రత్యామ్నాయ మార్గాల్లోనూ పలు అడ్డంకులు.. కొనసాగుతున్న పరిశీలన



2లో



2లో

## టారిఫ్‌లతో రూ.49.8 లక్షల కోట్లు ఆర్జించాం: ట్రంప్ ప్రకటన

- టారిఫ్‌ల ద్వారా 600 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందన్న ట్రంప్
- దేశం ఆర్థికంగా, భద్రతాపరంగా బలపడిందని వెల్లడి
- భారత ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్‌లు విధించిన అమెరికా
- అమెరికాపై ఆధారపడకుండా ఎగుమతులను విస్తరిస్తున్న భారత్

## ఏపీ గోల్డెన్ అథ్లెట్ జ్యోతి యర్రాజిని

# సత్కరించిన మంత్రి నారా లోకేశ్..

- రూ. 30.35 లక్షల ఆర్థిక సాయం
- ఏషియన్ అథ్లెటిక్స్‌లో స్వర్ణం గెలిచిన జ్యోతి యర్రాజీతో మంత్రి లోకేశ్ భేటీ
- జ్యోతి యర్రాజీ ఏపీకి గర్వకారణమని ప్రశంస
- ఆమె శిక్షణ కోసం ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వం
- ఒలింపిక్స్ ప్రయాణంలో పూర్తి అండగా ఉంటామని లోకేశ్ హామీ




2లో



2లో

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య..

# ఆగని మారణకాండ

- జషోర్ జిల్లాలో రాణా ప్రతాప్‌పై దుండగుల కాల్పులు
- ఇటీవలి వారాల్లో ఇది ఐదో ఘటనగా నమోదు
- విద్యార్థి నేత హత్య తర్వాత దేశంలో కొనసాగుతున్న అశాంతి
- మైనార్టీల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు

## మారిషస్ అధ్యక్షుడితో

# సీఎం మర్యాద పూర్వక భేటీ..

2లో



- గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు
- హాజరైన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్
- ఈ కార్యక్రమం అనంతరం ధరమ్ బీర్ గోకుల్ తో చంద్రబాబు సమావేశం



2లో

## జల వలయం..

# నగరానికి అభయం

- రూ. 8 వేల కోట్లతో రింగ్ మెయిన్
- జలమండలి భారీ కార్యాచరణ

# టారిఫ్‌లతో రూ.49.8 లక్షల కోట్లు ఆర్జించాం: ట్రంప్ ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం టారిఫ్‌ల విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌ల (సుంకాలు) ద్వారా తమ దేశానికి 600 బిలియన్ డాలర్లకు పైగా ఆదాయం వచ్చిందని, త్వరలో మరిన్ని నిధులు రానున్నాయని ఆయన ప్రకటించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు రూ.49.8 లక్షల కోట్లు. ఈ విధానం వల్ల దేశం ఆర్థికంగా బలపడటమే కాకుండా, జాతీయ భద్రత కూడా మెరుగుపడిందని ట్రంప్ వాదించారు. సుప్రీంకోర్టులో రానున్న కీలక తీర్పు నేపథ్యంలో మీడియా ఈ అంశాన్ని తక్కువ చేసి చూపుతోందని ఆయన ఆరోపించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఆయన ఒక పోస్ట్ చేశారు. "మేం టారిఫ్‌ల ద్వారా 600 బిలియన్ డాలర్లకు పైగా వసూలు చేశాం. కానీ ఫేక్ న్యూస్ మీడియా దీని గురించి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. ఎందుకంటే వారు మన దేశాన్ని ద్వేషిస్తారు, అగౌరవపరుస్తారు. సుప్రీంకోర్టులో రానున్న అత్యంత కీలకమైన టారిఫ్‌ల నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికే మీడియా ఇలా చేస్తోంది" అని ట్రంప్ ఆరోపించారు. టారిఫ్‌ల వల్లే అమెరికా మునుపెన్నడూ లేనంతగా ఆర్థికంగా, జాతీయ భద్రతాపరంగా బలంగా ఉందని, ప్రపంచంలో గౌరవం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 2025 జనవరిలో అధికారంలోకి వచ్చిన వెంటనే ట్రంప్, ఆయన బృందం టారిఫ్‌లను జాతీయ భద్రత, విదేశాంగ విధాన సాధనంగా ఉపయోగించడం ప్రారంభించడం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రపంచంలోని పలు దేశాల నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించారు. ముఖ్యంగా భారత ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ విధించారు. ఈ నేపథ్యంలో భారత్ తన ఎగుమతుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక ఒక కథనంలో పేర్కొంది. అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర దేశాలకు ఎగుమతులను విస్తరించేందుకు భారత్ ప్రణాళికలు రచిస్తోందని, ఈ విధానం రానున్న రోజుల్లో మరింత వేగవంతం కానుందని ఆ కథనం హైలైట్ చేసింది. భారత్‌కు అమెరికా అతిపెద్ద ఎగుమతి మార్కెట్ గా ఉంది. మన దేశ మొత్తం వస్తు ఎగుమతుల్లో దాదాపు 18 శాతం అమెరికాకే వెళుతున్నాయి. గార్మెంట్స్, లెదర్ ఉత్పత్తులు వంటివి ఇందులో ప్రధానమైనవి. అయితే, వ్యవసాయం, డెయిరీ వంటి సున్నితమైన రంగాల్లో అమెరికా ఉత్పత్తులకు ద్వారాలు తెరిచే విషయంలో భారత్ దృఢమైన వైఖరితో ఉండటంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంపై సందేహాలున్నాయి.

## ఏపీ గోల్డెన్ అథ్లెట్ జ్యోతి యర్రాజిని సత్కరించిన మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ అథ్లెట్ జ్యోతి యర్రాజిని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఏషియన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల హర్డిల్స్‌లో సరికొత్త మీట్ రికార్డుతో స్వర్ణ పతకం సాధించిన జ్యోతిని ఆయన ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి యర్రాజికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 30.35 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. జ్యోతి యర్రాజీతో భేటీ అయిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ఆంధ్రప్రదేశ్ గర్వకారణమైన జ్యోతి యర్రాజిని కలవడం చాలా సంతోషంగా ఉంది. ఆమె పట్టుదల, కృషి దేశానికే స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. ఏషియన్, కామన్వెల్త్ గేమ్స్‌కు సిద్ధమయ్యేందుకు ఈ ఆర్థిక సహాయం అందించామని వివరించారు. భవిష్యత్తులో జ్యోతి యర్రాజి ఒలింపిక్స్‌లో పతకం సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఒలింపిక్స్‌లో విజయం సాధించాలనే ఆమె ప్రయాణంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

## వంతెనపై పగుళ్లు.. బీహార్‌లో నిలిచిపోయిన ప్రపంచంలోనే అతిపెద్ద శివలింగం తరలింపు

ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత బరువైన శివలింగాన్ని తరలించడం బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లా అధికారులకు పెద్ద సవాలుగా మారింది. గండక్ నదిపై (స్థానికంగా నారాయణి నది అని పిలుస్తారు) ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో శివలింగం ప్రయాణం మధ్యలోనే నిలిచిపోయింది. తమిళనాడులోని మహాబలిపురంలో తయారు చేసిన ఈ శివలింగం ఆదివారం ఉదయం గోపాల్‌గంజ్‌కు చేరుకుంది. ఈ శివలింగం బరువు సుమారు 210 టన్నులు కాగా, దీనిని తరలిస్తున్న 106 చక్రాల ప్రత్యేక ట్రైలర్ బరువు మరో 160 టన్నులు. ఈ రెండింటి మొత్తం బరువును వంతెన మోయలేదని, ప్రాథమిక తనిఖీల్లో వంతెనపై చాలాచోట్ల పగుళ్లు ఉన్నట్లు గుర్తించడంతో భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, బీహార్ రాజ్య పుల్ నిర్మాణ్ నిగమ్ లిమిటెడ్ బృందాలను పిలిపించినట్లు జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ సిన్హా తెలిపారు. బీహార్ మంత్రి అశోక్ చౌదరి కూడా గోపాల్‌గంజ్‌కు వచ్చి వంతెనను స్వయంగా పరిశీలించనున్నారు. ఈ శివలింగాన్ని తూర్పు చంపారన్ జిల్లా కేంద్రమైన మోతిహారిలోని విరాట్ రామాయణ్ ఆలయానికి తరలించాల్సి ఉంది. ఇందుకోసం మహాబలిపురం నుంచి 3,178 కిలోమీటర్ల దూరం ప్రయాణించి 32 రోజుల్లో ఈ వాహనం ఇక్కడికి చేరుకుంది. అయితే, తూర్పు చంపారన్ చేరుకోవడానికి రెండు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ, వాటి పరిస్థితి కూడా సంతృప్తికరంగా లేదని అధికారులు చెబుతున్నారు. ఒక మార్గంలోని వంతెన సామర్థ్యం సరిపోదని, మరో మార్గంలో కూడా అనేక చిన్న వంతెనలు, కల్వర్టులు ఉండటంతో భారీ వాహనం ప్రయాణించడం కష్టమని తేలింది. దీంతో శివలింగాన్ని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చేందుకు అధికారులు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య... ఆగని మారణకాండ

బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగుతోంది. దేశంలో నెలకొన్న అశాంతి నేపథ్యంలో, తాజాగా మరో హిందూ వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. ఇటీవలి వారాల్లో ఇది ఐదో ఘటన కావడం గమనార్హం. జషోర్ జిల్లాలోని మణిరాంపూర్ ఉపజిల్లా కపాలియా బజార్‌లో సోమవారం సాయంత్రం 5:45 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మృతుడిని సమీపంలోని అరువా గ్రామానికి చెందిన రాణా ప్రతాప్ (45)గా గుర్తించారు. ఆయన బజార్‌లో ఉన్న సమయంలో దుండగులు కాల్పులు జరిపి హత్య చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గత నెలలో విద్యార్థి నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హాదీ హత్యకు గురైన నాటి నుంచి బంగ్లాదేశ్‌లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ఈ అశాంతి వాతావరణంలోనే హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఇటీవల మైమెన్‌సింగ్‌లో దైవదూషణ ఆరోపణలతో దీపు చంద్ర దాస్‌ను, రాజ్‌బరీ జిల్లాలో అమృత్ మోండల్‌ను మూకదాడుల్లో హత్య చేశారు. అలాగే, మెహ్రబరీలో బంగ్లాదేశ్ అన్సార్ దళ సభ్యుడు బజేంద్ర బిస్వాస్‌ను కాల్చి చంపగా, షరియత్‌పూర్‌లో ఖోకన్ చంద్ర దాస్ అనే వ్యాపారిని పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారు. ఈ వరుస హత్యలతో బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, కొన్ని ఘటనల్లో మతపరమైన కోణం లేదని తాత్కాలిక ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, హింస మాత్రం ఆగడం లేదు. ఈ హత్యలకు సంబంధించి ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేసినట్లుగానీ, దర్యాప్తు వివరాలను గానీ వెల్లడించలేదు.

## మారిషస్ అధ్యక్షుడితో సీఎం చంద్రబాబు మర్యాద పూర్వక భేటీ..



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గుంటూరులో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమం ముగిసిన అనంతరం వీరి భేటీ జరిగింది. ఈ సమావేశంలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ నేడు ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మారిషస్ అధ్యక్షుడికి వివరించారు. అలాగే, మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ధరమ్ బీర్ గోకుల్, గతంలో చంద్రబాబు మారిషస్‌లో పర్యటించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకే మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగానే ఆయన ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు.



## జల వలయం.. నగరానికి అభయం

హైదరాబాద్: వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో అన్ని ప్రాంతాలకు అంతరాయం లేని తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి భారీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలవనరులను అనుసంధానం చేస్తూ నగరం చుట్టూ 140 కిలోమీటర్ల పరిధిలో రేడియల్ రింగ్ మెయిన్‌ను ఏర్పాటు చేయనుంది. రింగ్ మెయిన్‌ను అనుసంధానం చేస్తూ మరో 96 కిలోమీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. రూ.8 వేల కోట్ల వ్యయంతో ఈ భారీ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు జలమండలి ప్రకటించింది.

**రింగ్ మెయిన్ అంటే?**

నగరానికి అంతరాయం లేని నీటి సరఫరా కోసం ఏర్పాటు చేయనున్న ప్రధాన పైప్‌లైన్ నెట్‌వర్క్ రింగ్ మెయిన్. ప్రధానంగా ఓఆర్ఆర్ వెంబడి దీన్ని ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన. రింగ్ మెయిన్‌కు అనుసంధానంగా వివిధ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తారు.

**ఎందుకోసం..?**

రాజధానికి తొలుత జంట జలశయాల నుంచి తాగునీరు అందేది. తర్వాత సింగూరు, మంజీరా తోడయ్యాయి. తాగునీటి అవసరాలు పెరగడంతో కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా మంజీరా పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. కృష్ణా, గోదావరి పైపులైన్లకు ఆటంకం ఏర్పడినా, ఇతర సమస్యలు ఎదురైనా సరఫరాకు అంతరాయం తప్పడం లేదు. నగరానికి నీటిని అందించేందుకు వనరులు ఉన్నా అనుసంధానం కాకపోవడంతో పలు ప్రాంతాలపై ప్రభావం పడుతోంది. ఏ ప్రాంతంలోనూ అంతరాయంలేని నీటి సరఫరాకు రింగ్ మెయిన్ ఉపకరిస్తుందని జలమండలి ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. మరో రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు అందుబాటులోకి వస్తుండటంతో అన్ని వనరులను రింగ్‌మెయిన్ ద్వారా అనుసంధానం చేస్తే నీటిని అందించేందుకు సానుకూలత ఏర్పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రయోజనాలు**

* ఒక ప్రాంతంలో మరమ్మతులు ఏర్పడినా.. ఇతర ప్రాంతాలపై ప్రభావం పడకుండా నీటిని అందించడం.
* 24 గంటల నీటి సరఫరా లక్ష్యంలో కీలకమైన వ్యవస్థ.
* అన్ని ప్రాంతాలకు సమాన ఒత్తిడితో నీరు అందించడం

## ఈ నెల 18న మేడారంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న మేడారం వెళ్లనున్నారు. జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మహా జాతరకు ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవార్ల గద్దెల పునరుద్ధరణతో పాటు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వేలాది మంది భక్తులు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నెల 19న మేడారం గద్దెల పునరుద్ధరణ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పునరుద్ధరణ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహా మంత్రులు హాజరు కానున్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభాపతి, ఇతర మంత్రులకు మేడారం మహా జాతరకు ఆహ్వానం అందింది. అసెంబ్లీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ ఆహ్వాన పత్రికలను అందించారు. మేడారం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించింది. మేడారంలో ఇప్పటికే భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి సుమారు 2 లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, జంపన్న, నాగులమ్మకు ముడుపులు కట్టి తమ భక్తిని చాటుకున్నారు. గద్దెల వద్ద పసుపు, కుంకుమ సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## వీసీలు కేవలం పరిపాలన అధిపతులు కాదు: మంత్రి నారా లోకేశ్



వైస్ ఛాన్సలర్లు (వీసీలు) కేవలం పరిపాలన అధిపతులుగా మిగిలిపోకూడదని, విద్యారంగాన్ని నడిపించే నాయకులుగా, సంస్కరణల రాయబారులుగా పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జ్ఞాన ఆధారిత సమాజాన్ని నిర్మించడంలో విశ్వవిద్యాలయాల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగిన పబ్లిక్ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల సమీక్షా సమావేశంలో లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన పాదయాత్రలో ఎంతో మంది యువతను కలిశానని, సర్టిఫికెట్లు చేతిలో ఉన్నా ఉద్యోగాలు లేక గందరగోళంలో ఉన్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సవాళ్లతో కూడిన విద్యాశాఖను తీసుకున్నానని తెలిపారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యలో ప్రధానంగా ఐదు అంశాలపై దృష్టి సారించాలని వీసీలకు దిశానిర్దేశం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల్లో మార్పులు తీసుకురావాలని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్‌లు పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని సూచించారు. "డిగ్రీలు పూర్తిచేసినా ఉద్యోగం రాక మన విద్యార్థులు అమీర్‌పేటలో శిక్షణ పొందితే కానీ ఉద్యోగం సాధించలేకపోతున్నారు. ఇది విద్యార్థుల వైఫల్యం కాదు, మన సంస్థల వైఫల్యం" అని మంత్రి లోకేశ్ అన్నారు. పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రతి వారం విద్యార్థులతో నేరుగా మాట్లాడేందుకు 'ఓపెన్ హౌస్' నిర్వహించాలని వీసీలను కోరారు. అందరి కృషితో రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను ప్రపంచస్థాయి సంస్థలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

**ఉన్నత విద్యలో 5 సవాళ్లు**

ప్రస్తుతం ఉన్నత విద్యారంగం ఐదు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోందని మంత్రి లోకేశ్ విశ్లేషించారు.

1. బోధన అవసరాల మధ్య అంతరం: పరిశ్రమల అవసరాలకు, మనం బోధిస్తున్న పాఠ్యాంశాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనివల్ల మన డిగ్రీలకు అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గుతోంది. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ సైతం ఎప్పటికప్పుడు తమ పాఠ్యాంశాలను పూర్తిగా మారుస్తోందని, మనం కూడా కాలానుగుణంగా సిలబస్‌ను నవీకరించాలని సూచించారు.
2. ఉద్యోగావకాశాలు లేని డిగ్రీలు: ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ వ్యవస్థలు సరిగా లేకపోవడంతో మన డిగ్రీలకు విశ్వసనీయత కొరవడుతోంది. మన వర్సిటీల నుంచి పట్టభద్రులైన విద్యార్థులు ఉద్యోగాలు సాధించలేకపోతుండగా, అమీర్‌పేటలో నాలుగు నెలల శిక్షణతో ఉద్యోగాలు పొందుతున్నారని, ఇది విద్యార్థుల వైఫల్యం కాదని, మన విద్యాసంస్థల వైఫల్యమని స్పష్టం చేశారు.
3. ప్రయోజనం లేని పరిశోధనలు: పరిశోధనలు కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారాలి. నీటికొరత, వాతావరణ మార్పులు వంటి సమస్యలకు వర్సిటీలు పరిష్కారాలు చూపాలి.
4. పరిపాలనా భారం: అధ్యాపకులు, వీసీలు బోధన కంటే పరిపాలనపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ఈ పాత పద్ధతులు వీడి, అకడమిక్ ప్రమాణాలపై దృష్టి సారించాలి.
5. విద్యార్థుల అనుభవంలో లోపాలు: విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, మానసిక మద్దతు కొరవడుతోంది. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

# చైనా మాంజాకు 'నో' చెప్పండి.. ప్రాణాలకు 'ఎస్' చెప్పండి!

* **సంక్రాంతి సందర్భంగా ఎస్సై పగిడిపల్లి ఓం ప్రకాష్ సూచన**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సంక్రాంతి పండుగ సీజన్ ప్రారంభమైందంటే గాలిపటాల సందడి సహజమే. పండుగ ఆనందం మన సంతోషానికే పరిమితం కావాలి తప్ప.. ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఓఎస్డీ కార్యాలయంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పగిడిపల్లి ఓం ప్రకాష్ ప్రజలకు వీడియో సందేశం ద్వారా స్పష్టమైన హెచ్చరిక చేశారు. ఉదాహరణలతో రూపొందించిన ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతుంది. చైనా మాంజా గురించి ఎస్సై ఓం ప్రకాష్ చెప్పిన విషయాలు మీకోసం. చైనా మాంజా (చైనీస్ నైల్ థ్రెడ్) ఎంత ప్రమాదకరమో ఆయన ఉదాహరణలతో వివరించారు. సింథటిక్ ఫైబర్‌పై గాజు పొడి పూతతో తయారయ్యే ఈ మాంజా సాధారణ దారం కాదని, గాలిలో వేలాడే కత్తిలాంటిదని తెలిపారు. ఇది మన మెడకు తగిలితే సొరకాయ కోసినట్లే ప్రమాదం జరుగుతుందని హెచ్చరించారు.టూ వీలర్ రైడర్లు, పాదచారులు, పశువులు, పక్షులు ఈ చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. డీప్ కట్స్, అధిక రక్తస్రావంతో కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోతున్నాయన్నారు.ఇది నాన్ బయోడిగ్రేడబుల్ కావడంతో భూమిలో కలవదని, పర్యావరణానికీ తీవ్ర హాని చేస్తుందని తెలిపారు. చైనా మాంజా అమ్మడం మాత్రమే కాదు.. కొనడం కూడా నేరమేనని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమంగా విక్రయిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.చైనా మాంజా స్థానంలో సురక్షితమైన కాటన్ మాంజాను ఉపయోగించాలని, ట్రాఫిక్ లేని, విద్యుత్ తీగలు లేని ఓపెన్ గ్రౌండ్స్‌లోనే గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే గాలిపటాలు ఎగురవేయనివ్వాలని చెప్పారు."మన సరదా ఎవరికి శాపంగా మారకూడదు. ఈ సంక్రాంతికి చైనా మాంజాకు 'నో' చెప్పండి" అంటూ ఎస్సై ఓం ప్రకాష్ ఇచ్చిన ఈ సందేశం ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. సే నో టు చైనా మాంజా - సేఫ్ సంక్రాంతి జరుపుకుందాం!

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు ని కుత్బుల్లాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి రాజు యాదవ్, శ్రీహరి గుప్తా, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## చింతల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్యకు శుభాకాంక్షలు




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : చింతల్ సర్కిల్ (వార్డు నెంబర్ 282) డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన లావణ్య ని భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకె ను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, రాఘవులు, వెంకట్ రెడ్డి, శ్రీధర్ గౌడ్,మల్లేశం, ప్రవీణ్ కుమార్ గౌడ్, ప్రదీప్ రెడ్డి, స్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో సోమవారం ఎస్పీ రోహిత్ రాజు సమావేశమయ్యారు.ముఖ్యంగా ఏటిఎంలలో జరుగుతున్న చోరీలు బ్యాంకులలో జరుగుతున్న దొంగతనాలను ఉద్దేశించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు తమ తమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.బ్యాంకుల లోపల మరియు వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని,నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సూచించారు.బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలారం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ఏటీఎం లలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని,అక్కడ సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఏటీఎం ల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమమని తెలిపారు.సామాజిక బాధ్యతలో భాగంగా సైబర్ క్రైమ్స్ పై బ్యాంకుల తరపునుండి కూడా జిల్లా ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా కరపత్రాలను,పోస్టర్లను తయారుచేసి ముఖ్యమైన ప్రదేశాల్లో అతికించాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడి నగదును కోల్పోయిన బాధితులకు నేరగాళ్ల అకౌంట్లలో ఫ్రీజ్ చేయబడిన నగదును త్వరితగతిన వారికి అందేలా పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

## నిఖిత కుటుంబానికి అండగా ఉంటాం : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన గోడిశాల నిఖిత మాజీ ప్రియుని చేతిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో ఉంటున్న నిఖిత కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలియజేశారు. నిఖిత మృతి విషయం తెలిసిన వెంటనే విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. నిఖిత మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన సహకారం అందించాలని ఆయనను కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో అధికారులు నిఖిత కుటుంబ సభ్యులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అవసరమైన సహాయం అందిస్తున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్ రెడ్డి ట్వీట్ చేసారు.

## ఖమ్మం నగరంలో
# ఐదులక్షల గొంతుకలు రణన్నినాదం

* **18న ఖమ్మంలో చారిత్రాత్మక సభ**
* **కమ్యూనిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం వందేళ్ల ముగింపు ఉత్సావాలు**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జనవరి 18న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంతాల ముగింపుసభ ఐదు లక్షల గొంతుకలు రణన్నినాదమని, భవిష్యత్తు ప్రజా పోరాటాలకు ఖమ్మం సభ ప్రేరణగా నిలవబోతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ఖమ్మం భహిరంగ సభ విజయవంతంకోసం సిపిఐ జిల్లా సమితి చేపట్టిన ప్రచారజా జాతా మూడోరోజైన సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగింది. మండలంలోని అనిశెట్టిపల్లి, సీతారాంపురం గ్రామ సెంటర్లలో జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను కేవలం జ్ఞాపకంగా కాకుండా భవిష్యత్ పోరాటాలకు పునాది చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ శతాబ్ద కాల చరిత్ర ప్రజల కోసం చేసిన త్యాగాలు, పోరాటాలతో నిండి ఉందని ఆయన అన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న అసమానతలు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు అవసరమని పిలుపునిచ్చారు. జనవరి 18న జరిగే బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ప్రజలు దండుగా కదలిరావాలని ఆయన కోరారు. ఈ సభ కమ్యూనిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవబోతోందని అన్నారు. ప్రచారజాతలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, చంద్రగిరి శ్రీనివాసరావు, ఫహీయం, దీటి లక్ష్మీపతి, అజిత్, నూనావత్ గోవిందు, జర్పుల ఉపేందర్, బిబి, సపావట్ రవి, జలీల్ పాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కన్ సాన్ పల్లిలో గ్రామ స్థాయి టోర్నమెంట్

* **ఈ నెల 12 నుండి 15 వరకు మూడు రోజుల పాటు క్రీడలు...**
* **కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు...**
* **150 మంది క్రీడాకారులకు ఉచితంగా క్రీడా జెర్సీలు పంపిణీ చేయనున్న సర్పంచ్ సునీత మహిపాల్**

అందోలు, ప్రజాస్ఫూర్తి: పల్లె టూళ్లలో నిర్వహించే గ్రామీణ క్రీడలు శారీరక ధృఢత్వం, మానసిక వికాసం,సామాజిక బంధాలను పెంపొందించడంతో పాటు గ్రామీణ సంస్కృతిలో భాగం, పండుగల సమయంలో ఉత్సాహాన్ని నింపుతాయి. ఇందుకు తమ గ్రామ యువకులకు శారీరక ధృఢత్వం, మానసిక వికాసం కలిగేలా గత మూడేళ్లుగా గ్రామస్థాయి క్రీడా పోటీలను నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ గ్రామ యువకులు. అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామానికి చెందిన యువత ఉద్యోగ, చదువుల రీత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండి అందరూ ఒకే చోట కలుసుకునే అవకాశాలు అంతంతో మాత్రం గానే ఉండేవి. ఇట్టి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన తలారి బాలకృష్ణ, జోగాల ప్రవీణ్, బైండ్ల కృష్ణ, రాపర్తి ప్రభు అనే నలుగురు యువకులు తమ గ్రామానికి చెందిన గ్రామ యువకులను ఒకచోట చేర్చేందుకు నిర్ణయించుకొని సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడా పోటీలను ఒక వేదికను చేసుకున్నారు. మూడేళ్ల క్రితం (కేపిల్) కన్ సాన్ పల్లి ప్రీమియర్ లీగ్ పేరుతో క్రికెట్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. మొదటి సీజన్ లో క్రీడల్లో పాల్గొనేందుకు గ్రామ యువకుల నుండి అంతంత మాత్రంగానే స్పందన వచ్చిన అటు తర్వాత ఈ క్రీడల్లో పాల్గొనడంలో ఉత్సాహం చూపారు. ప్రస్తుత మూడవ సీజన్ లో క్రికెట్, వాలీబాల్ తో పాటు గ్రామ యువత కోరిక మేరకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడల్లో సుమారుగా వందకు పైగా క్రీడాకారులు పాల్గొననుండడంతో ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో పెద్ద క్రీడా సంబరం కానుంది.

**క్రీడా పోటీల వివరాలు:**

**కబడ్డీ..**

ఈ నెల 12, 13 తేదీలలో సాయంత్రం 5 గంటలకు కబడ్డీ పోటీలను గ్రామంలోని శివాలయం వద్ద నిర్వహించనున్నారు.

**క్రికెట్..**

13, 14 తేదీలలో ఉదయం 10 గంటలకు గ్రామ శివారులోని కొత్తకుంట్ల మదుగు వద్ద క్రికెట్ పోటీ వేదిక ఏర్పాటు చేశారు.

**వాలీబాల్...**

15న ఉదయం 10 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలను నిర్వహించి అదేరోజు సాయంత్రం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ క్రీడా పోటీలకు సంబంధించి ఈ నెల 10న సాయత్రం 6 గంటలకు డ్రా తీయనున్నారు.

**క్రీడాకారులకు జెర్సీల పంపిణీ...**

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలలో పాల్గొని క్రీడాకారులందరికి సుమారుగా 150 మంది క్రీడాకారులకు క్రీడా జెర్సీలతో పాటు క్రీడా కిట్లను ఇటీవల గ్రామ నూతన సర్పంచ్ గా ఎన్నికైన తెలుగు సునీత మైపాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తెలుగు ప్రవీణ్ ముదిరాజ్ ల ఆర్థిక సహాయంతో జెర్సీలు అందజేయనున్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు గ్రామ యువకుడు కీ. శే బుస నెల్లి సాయికుమార్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బుసనెల్లి ఆంజనేయులు క్రీడా బహుమతులను పంపిణీ చేయనున్నారు. క్రీడా పోటీలు జరిగే వేదికల వద్ద క్రీడాకారులకు భోజన మరియు నీటి వసతులు కల్పిస్తున్నారు.

## మందుబాబులకు అడ్డాగా మారుతున్న వాకింగ్ ట్రాక్‌లు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజలకు ఉల్లాసం, ఆరోగ్యాన్ని అందించాల్సిన అంబీర్ చెరువు వాకింగ్ ట్రాక్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ వాకింగ్ ట్రాక్‌లు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్‌లో ఉన్న అంబీర్ చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద పట్టపగలే యథేచ్ఛగా మద్యం సేవిస్తూ మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారు. దీని వల్ల వాకింగ్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజల ఆరోగ్య నిమిత్తం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ మందుబాబుల అడ్డాగా మారడం కాలనీవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, మందుబాబుల ఆగడాలను అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 7.4 కేజీల గంజాయి పట్టివేత



ప్రజా స్ఫూర్తి, పాల్వంచ: ఒడిశా నుంచి పాల్వంచకు బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 7.4 కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సోమవారం పట్టుకుంది.పాల్వంచ పట్టణ శివారులోని కేశవాపురం పంచాయతీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఎస్సై శ్రీహరి రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వచ్చిన బైక్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితుల నుంచి 7.4 కేజీల గంజాయి, ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులను పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ కేసులో గొల్లపల్లి చిరాకుపల్లికి చెందిన సాంబశివరావు, భూక్య శ్రీహరి, పోతుల చిన్నలను అరెస్టు చేసి స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారులు తెలిపారు.గంజాయిని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 3.50 లక్షలుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

# బస్సులో వెళ్లి సినిమా చూసిన CM రేవంత్, మంత్రులు




హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'పూలే' సినిమాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీక్షించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం మంత్రులతో కలిసి బస్సులో ప్రసాద్ ల్యాబ్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. సినిమాను వీక్షించిన అనంతరం మాట్లాడారు. జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి పూలే సమాజం కోసం చేసిన త్యాగాలను ఈ సినిమా కళ్లకు కట్టినట్లు చూపించిందని కొనియాడారు. దర్శకుడు అనంత్ మహదేవన్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని ప్రశ్నించారు. పూలే పాత్రలో ప్రతీక్ గాంధీ, సావిత్రీబాయి సావిత్రీబాయి పాత్రలో పత్రలేఖ పాల్ నటించారు. వీరిద్దరి నటన చిత్రానికి హైలెట్‌గా నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందించారు. హిందీ భాషలో రూపొందిన ఈ చిత్రం 2025 ఏప్రిల్ 25న విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత తెలుగులోనూ అనువదించారు. సీఎం, మంత్రులతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కూడా 'పూలే' చిత్రాన్ని వీక్షించారు.

# తెలుగువారు అయ్యుండి.. తెలుగు మాట్లాడకపోతే లోపం ఉన్నట్లే: వెంకయ్యనాయుడు

గుంటూరు: రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలను గుర్తించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. గుంటూరులో మూడో తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. గొప్పవారంతా తమ మాతృభాషలో చదువుకొనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వెంకయ్యనాయుడు తెలిపారు. తెలుగు భాషను సజీవంగా ఉంచేందుకు ఎంతో మంది కృషి చేశారని కొనియాడారు. "నన్నయ్య, తిక్కన, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, ఎన్టీ రామారావు, రామోజీరావు.. ఇలా చాలా మంది మహనీయులు తెలుగు భాష ఉన్నతి కోసం శ్రమించారు. తెలుగువారు అయ్యుండి తెలుగు మాట్లాడకపోతే ఏదో లోపం ఉన్నట్లే లెక్క. అమ్మ అంటే అంతరాళం నుంచి వస్తుంది. అదే మమ్మీ అంటే నోటి నుంచి మాత్రమే వస్తుంది. మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని



మరచినవారు పరిపూర్ణ మానవుడు కాదు. ఈతరంలో తెలుగు భాష నేర్చుకోవాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. గుడి, బడి, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాతృభాషలోనే చదువుకున్నారు. మాతృభాషను మరిచిపోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాషను కాపాడుకోవాలంటే తెలుగులో మాట్లాడితే చాలు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ఇతర దేశాల్లో సాంకేతిక విద్య, ఇతర విద్యా కోర్సులు వారి మాతృభాషలోనే ఉంటున్నాయి. మన దేశంలోనూ ప్రధాని మోదీ మాతృభాషలోనే సాంకేతిక కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానిక ప్రభుత్వాలు కూడా మాతృభాషలోనే ఉత్తర్వులు ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగు అమలు చేయాలి. న్యాయస్థానాల్లో తెలుగు భాషను అమలు చేస్తే చాలా బాగుంటుంది" అని వెంకయ్యనాయుడు తెలిపారు.



## పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ గ్రామ పరిధిలో ఉన్న ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీక్ ఘటన కారణంగా తలెత్తిన బ్లో అవుట్ ప్రభావం గురించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బ్లో అవుట్ చోటు చేసుకున్న ప్రాంతానికి కిలో మీటరు పరిధిలో ఉన్న పాఠశాలలను ఖాళీ చేయించామని తెలుపుతూ ఇరుసుమండ ప్రాంతంలో చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సంసిద్ధంగా ఉన్నాయనీ, సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి తరలిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తోనూ పవన్ కల్యాణ్ ఫోన్‌లో మాట్లాడారు. బ్లో అవుట్ విషయమై పరిసర ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, సామాజిక మాధ్యమాల్లో వదంతులు, ఆందోళన కలిగించే అంశాలు ప్రచారం కాకుండా చూడాలని సూచించారు. పరిసరాల్లో ఉండే కొబ్బరి తోటలకు మంటలు వ్యాపించకుండా



చర్యలు చేపట్టాలన్నారు. సహాయక శిబిరాల్లో ఉండేవారికి అవసరమైన ఔషధాలతోపాటు, శీతాకాలమైనందున దుప్పట్లు కూడా ఇవ్వాలని సూచించారు.

## భగ్గుమన్న పాత కక్షలు..
## ఇద్దరి దారుణ హత్య

ఎమ్మిగనూరు: కర్నూలు జిల్లాలో పాత కక్షలు భగ్గుమన్నాయి. తమ వర్గం వారిని హత్య చేశారని.. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరు మండలంలోని కందనాతిలో వెంకటేశ్ (40), పరమేశ్ (35)ను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. మరొక వ్యక్తి గోవింద్ ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. వీరికి.. రెండేళ్ల క్రితం హత్యకు గురైన వర్గం వారికి వర్గపోరు నడుస్తోంది. గతంలో ఊరు వదిలి వెళ్లిపోయిన వైరి వర్గంవారు తిరిగి వచ్చారు. ఎప్పట్నుంచో వారి కోసం ఎదురు చూస్తోన్న ప్రత్యర్థులు పొలంలో పరమేశ్‌ను హత్య చేశారు. వెంకటేశ్‌ను గ్రామంలో చంపేశారు. గోవింద్ పొలం నుంచి వస్తుండగా వేటకొడవళ్లతో దాడి చేయగా.. తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలానికి డీఎస్పీ భార్గవి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఒకటిన్నర సంవత్సరంలోనే ఘనత.. పవన్‌పై నాగబాబు ప్రశంసలు

అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. ఎన్.ఆర్.ఐ. జనసేన శ్రేణులతో సోమవారం జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్థిరంగా నిలబడాలనీ, కూటమిలో సర్దుబాటు కోసం కొంతమందికి త్యాగాలు చేయాల్సిన బాధ్యత ఉంటుందని తెలిపారు. ఇందుకు తాను కూడా ఒక ఉదాహరణ అని చెప్పారు. గతంలో దేశంలోనే 24వ స్థానంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖను పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒకటిన్నర సంవత్సరంలోనే మొదటి స్థానంలోకి తీసుకొచ్చిన ఘనతను సొంతం చేసుకున్నారని ప్రశంసించారు. ప్రజల ధనం ప్రజల కనీస అవసరాలకు ప్రథమ ప్రాధాన్యంగా



ఖర్చు చేయాలనే సదుద్దేశంతో పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాలను, మండలాలను, జిల్లాలను అనుసంధానం చేసే రహదారుల కోసం రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు నాగబాబు చెప్పారు.

### గొప్ప నాయకుడు పవన్

గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టిన గొప్ప నాయకుడు పవన్ కల్యాణ్ అని నాగబాబు తెలిపారు. అమరజీవి జలధార ద్వారా ఐదు జిల్లాల పరిధిలో రానున్న 35 ఏళ్లలో 1.21 కోట్లమంది దాహార్తి తీర్చాలని పవన్ కల్యాణ్ సంకల్పించారని చెప్పారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీరప్రాంతం వెంబడి నివసించే మత్స్యకార సోదరులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ఎక్కువ శాతం తీర ప్రాంతాలను కలిపేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం అమరుడైన పొట్టి శ్రీరాములుని సదా స్మరించుకోవాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు "అమరజీవి జలధార"గా నామకరణం చేశారని నాగబాబు స్పష్టం చేశారు.

## జగన్‌ను ఇలాగే వదిలేస్తే..
## ఆ ఘనతా మాదే అంటారు: సోమిరెడ్డి

అమరావతి: భోగాపురం విమానాశ్రయంపై వైకాపా అధ్యక్షుడు జగన్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తెదేపా సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హితవు పలికారు. ఎర్రబస్సు రాని ఊళ్లకు ఎయిర్‌బస్సు ఎందుకని ఉత్తరాంధ్రను నాడు హేళన చేసిన జగన్.. నేడు కనీస నైతికత లేకుండా చెబుతున్న డైలాగులు వెగటు పుట్టిస్తున్నాయన్నారు. ఆయన్ను ఇలాగే వదిలేస్తే దేశానికి స్వాతంత్ర్యం తన తాతే తెచ్చాడని.. పోఖ్రాన్ అణుపరీక్షలు తమ కుటుంబ ఘనతే.. ఆపరేషన్ సిందూర్ వెనుక తన వ్యూహాలు కూడా ఉన్నాయని చెబుతారని ఎద్దేవా చేశారు. ఇలాంటి వారి వల్లే రాజకీయ



నేతలపై ప్రజలకు గౌరవం తగ్గిపోతోందని సోమిరెడ్డి విమర్శించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు బిగ్ అలర్ట్..
## రిటైర్మెంట్ వయోపరిమితి పెంపుపై కీలక భేటీ

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయోపరిమితపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లతో పాటు 9,10 షెడ్యూల్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయోపరిమితిని పెంచాలని భావిస్తోంది. ఈ మేరకు కేబినెట్ సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. అయితే కేబినెట్ సబ్ కమిటీ సోమవారం సాయంత్రం అధికారులతో ఆన్ లైన్ విధానంలో భేటీ అయింది. ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయోపరిమితి పెంపుపై మంత్రులు నారాయణతో పాటు పయ్యావుల కేశవ్ చర్చించారు. కోర్టు ఆదేశాలతో 62 ఏళ్ల నిండిన 2,831 ఉద్యోగుల పరిస్థితిపైనా ఈ భేటీలో చర్చించారు. రిటైర్మెంట్ వయసు పెంచితే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం ఎంత?, ప్రభావాన్ని ఎలా ఉంటుందనే అంశంపైనా చర్చించారు.

*** కార్పొరేషన్ల వారీగా ఉద్యోగుల సంఖ్యపై ఆరా**

అయితే కార్పొరేషన్ల వారీగా ఉద్యోగులు ఎంత మంది ఉన్నారు. వయో పరిమితి పెంచితే ప్రభుత్వంపై పడే ఆర్థిక



భారం వివరాలు సేకరించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. ఇందులో భాగంగా మరోసారి భేటీ నిర్వహించాలని సూచించింది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంపుపై సమగ్రంగా చర్చించాలని, ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులను ఆదేశాలు జారీ చేసింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం..
## తెలుగు దంపతుల మృతి

యలమంచిలి: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు దంపతులు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భార్యాభర్తలు కొటికలపూడి కృష్ణ కిశోర్ (టిన్ను) (45), ఆశ (40) వాషింగ్టన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారి కుమార్తె, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. కృష్ణ కిశోర్ దశాబ్ద కాలానికి పైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఆ దంపతులు 10 రోజుల క్రితం



పాలకొల్లు వచ్చి తిరిగి వెళ్లారు. మార్గంమధ్యలో దుబాయ్‌లో న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. వీరి మృతితో పాలకొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

## కోనసీమలో ఇంకా ఆరని మంటలు.. కొనసాగుతున్న గ్యాస్ లీకేజీ

అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటన తీవ్రత తగ్గలేదు. ఇవాళ (సోమవారం) ఉదయం నుంచి గ్యాస్ లీక్ కారణంగా చెలరేగిన మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. గ్యాస్ కిలోమీటర్ల మేర వ్యాపించడంతో పరిసర గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఇప్పటికే స్థానికులను ఇళ్ల నుంచి ఖాళీ చేయించారు. మంటలు క్రమంగా విస్తరిస్తుండటంతో ఇప్పటివరకు సుమారు 600 కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు.



### 24 గంటల సమయం..?

ఈ ఘటనపై ఓఎన్జీసీ అధికారులు లేఖ విడుదల చేశారు. ప్రమాద ప్రాంతం నుంచి 600 మీటర్ల పరిధిలో నివాస ప్రాంతాలు లేవని వెల్లడించారు. గ్యాస్ లీక్‌ను అరికట్టేందుకు అంతర్జాతీయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, ఘటనా స్థల పరిస్థితిని తమ సంస్థకు చెందిన సీనియర్ నిపుణులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఓఎన్జీసీ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది నిరంతరంగా శ్రమిస్తున్నారు. పరిస్థితిని పూర్తిగా నియంత్రించే వరకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు. కాగా, గ్యాస్ లీక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు కనీసం 24 గంటల సమయం పడుతుందని, గ్యాస్ నిల్వలు పూర్తిగా అయిపోతేనే మంటలు ఆగే అవకాశం ఉందని అధికారుల సమాచారం.

## పోలీస్‌స్టేషన్ ఎదుట వ్యక్తి దారుణహత్య



తనకల్లు: పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చిన ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారుజామున తనకల్లు పీఎస్ ఎదుట ఈశ్వరప్ప అనే వ్యక్తిని అన్నదమ్ములు హరి, చెన్నప్ప హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగినేపల్లికి చెందిన ఈశ్వరప్ప.. ఈనెల 1న హరి భార్యను తీసుకెళ్లాడు. హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గాలింపు చేపట్టారు. వారిరువురూ గూడూరులో ఉన్నట్లు తెలుసుకుని ఆదివారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున పీఎస్ వద్దకు వారిద్దరినీ తీసుకొచ్చారు. కారు దిగి స్టేషన్‌లోకి వెళ్తుండగా.. ఈశ్వరప్పను హరి, చెన్నప్ప కొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటనతో హరి భార్య అక్కడి నుంచి పరారైంది.

## ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు: షర్మిల ట్వీట్ వైరల్

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకైన ఘటనపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. "రాజోలు నియోజకవర్గం మలికిపురంలో ONGC డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకేజీ ఘటన తీవ్ర భయాందోళనకు గురిచేసింది. మంటలు ఎగసి పడుతున్న దృష్ట్యా ఎటువంటి నష్టం జరగకుండా ప్రభుత్వం సహాయక చర్యలు ముమ్మరం చేయాలి. వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలి. ఈ ఘటన మరో బ్లో అవుట్ కి దారి తీస్తుందని ఆ ప్రాంత ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. తక్షణం చుట్టుపక్కల గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. కోనసీమ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నాం. మంటలు అదుపులోకి తీసుకొచ్చే వరకు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు



తరలించే కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వండి. మనవంతు సహాయక కార్యక్రమాలు నిర్వహించండి.

# 'బీఆర్ఎస్ నన్ను ఘోరంగా అవమానించింది'.. మండలిలో కవిత కంటతడి



హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. "బీఆర్ఎస్‌లో ఏ బాధ్యత ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేశా. పార్టీలో ప్రశ్నిస్తే నాపై కక్షగట్టారు. అక్కడే అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోతే రాష్ట్రంలో ఎలా ఉంటుంది? పార్టీ నన్ను ఘోరంగా అవమానించింది. ఈడీ, సీబీఐలతో పోరాడేటప్పుడు నాకు అండగా నిలవలేదు. కేసీఆర్‌పై కక్షతో భాజపా నన్ను జైలులో పెట్టించింది. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను"అని కవిత అన్నారు.

**వచ్చే ఎన్నికల్లో 'జాగృతి' పోటీ**

ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. "ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. నాది ఆస్తుల పంచాయతీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా" అని కవిత వ్యాఖ్యానించారు.

## నదీ జలాల వ్యవహారం కోర్టుల్లో తేలదు



**: సీపీఐ నేత నారాయణ**

హైదరాబాద్: నదీ జలాల వ్యవహారం కోర్టుల్లో తేలదని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ అన్నారు. నదీ జలాల విషయంపై ఇరు రాష్ట్రాలు సుప్రీంకోర్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నారాయణ స్పందించారు. నదీ జలాల అంశంలో ఇరు రాష్ట్రాల సీఎంలు పైచేయి కోసం బహిరంగ ప్రకటనలు చేయవద్దని సూచించారు. నాలుగు గోడల మధ్య కూర్చొని నిర్ణయం తీసుకోవాలన్నారు. అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకొని ఒక నిర్దిష్ట స్వరూపంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుపడేలా నిర్ణయం తీసుకోవాలని హితవు పలికారు.

## క్రూజ్ బుకింగ్ పేరుతో 'ముంచేశారు'..
# హైదరాబాదీకి ₹2.42 లక్షలకు టోకరా!

హైదరాబాద్: నగరానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. క్రూజ్ ట్రిప్ బుకింగ్ పేరు చెప్పి ముంచేశారు. పలు దఫాల్లో రూ.2.42 లక్షలు దోచేశారు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ పోలీసుల కథనం ప్రకారం.. కాచిగూడకు చెందిన ఓ వ్యక్తి గూగుల్ సెర్చ్‌లో కనిపించిన వెబ్‌సైట్ ద్వారా డిసెంబర్ 26న కొచ్చి లక్షద్వీప్ ముంబయికి క్రూజ్ ట్రిప్ బుక్ చేశాడు. మొత్తం నాలుగు టికెట్లకు గానూ ముందస్తు అడ్వాన్సుగా రూ.23,680 చెల్లించాడు.

ఒకేసారి అంతమొత్తం ట్రాన్స్‌ఫర్ అవ్వకపోవడంతో వివిధ దఫాల్లో చేయాలని అవతలి వ్యక్తి సూచించాడు. తర్వాత లక్షద్వీప్ పర్మిట్ లెటర్లు, పిల్లల ఛార్జీలంటూ అదనపు మొత్తాలు కట్టాలన్నారు. సాంకేతిక కారణాలు ఉన్నాయని, మీరు చెల్లించిన మొత్తం చెక్‌అవుట్ సమయంలో రిఫండ్ చేస్తామంటూ మళ్లీ మళ్లీ పేమెంట్లు చేయించారు. కారణం చెప్పకుండా బుకింగ్ క్యాన్సిల్ చేయడంతో పాటు, క్యాన్సిలేషన్ ఛార్జీ కింద మరో రూ.48,500 కట్టాలని డిమాండ్ చేశారు. మొత్తం రిఫండ్ చేస్తామని నమ్మబలికారు. మొత్తంగా రూ.2.42 లక్షలు వివిధ దఫాల్లో వసూలు చేశారు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు కంపెనీ కస్టమర్ కేర్ ప్రతినిధిగా ఓ వ్యక్తి వాట్సప్ ద్వారా



తనను సంప్రదించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ తరహా ఘటనలపై పౌరులకు అవగాహన కల్పించడం కోసం డిప్యూటీ కమిషనర్ (సైబర్ క్రైమ్స్) ఓ అడ్వైజరీని జారీ చేశారు.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..**

>> పర్యాటక ప్యాకేజీలను ఎప్పుడూ అధికారిక వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ ఏజెంట్ల ద్వారానే బుక్ చేయండి.

>> గూగుల్ సెర్చ్ లేదా అడ్వర్టైజ్‌మెంట్లలో కనిపించే సైట్లను నమ్మి పేమెంట్లు చేయొద్దు.

>>సాంకేతిక సమస్యలు, పేమెంట్ ఫెయిల్యూర్ల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే అనుమానించండి.

>> అధికారిక వెబ్‌సైట్‌లో ఉండే కస్టమర్ కేర్ నంబర్లనే నమ్మండి.. వాట్సప్‌లో సంప్రదించేవారిని విశ్వసించొద్దు.

>> సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయండి.

>> సైబర్ నేరాలకు సంబంధించి అత్యవసర సందర్భాల్లో 87126 65171కు కాల్ లేదా వాట్సప్ చేయండి.

## నిఖిత కుటుంబానికి
# అవసరమైన సహాయం అందిస్తాం



హైదరాబాద్: అమెరికాలో హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల గోడిశాల నిఖిత హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆమె మృతి పట్ల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "నిఖిత కుటుంబం నా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని తార్నాకలో ఉన్న విజయపురి కాలనీలో ఉంటోంది. నిఖిత మృతి విషయం తెలిసిన వెంటనే జర్మనీ పర్యటనలో ఉన్న విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో మాట్లాడాను. నిఖిత మృతదేహాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు సహకరించాలని కోరాను. ఢిల్లీలోని మా కార్యాలయం, తెలంగాణ భాజపా కార్యాలయం ఈ విషయంలో నిఖిత కుటుంబసభ్యులతో నిరంతరం మాట్లాడుతూ.. అవసరమైన సహకారాన్ని అందిస్తోంది"అని పేర్కొన్నారు.

## బీరాలు పలికి.. అసెంబ్లీ నుంచి జారుకొన్న బీఆర్ఎస్ నేతలు

**: మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్: ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు సభ నుంచి తోకముడిచారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభాపతిని అవమానపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బీఏసీ సమావేశంలో యక్ష ప్రశ్నలు వేసిన ఆ పార్టీ నాయకులు.. ఇప్పుడు అసలు కనిపించట్లేదన్నారు. "శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ, బయట చెప్పడం సమంజసం కాదు"అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు.

## తల్లిదండ్రులు బడికెళ్లమన్నందుకు..
# ఉరి వేసుకుని బాలుడి ఆత్మహత్య

రాయదుర్గం: సెలవులు ముగిశాయి.. బడికి వెళ్లేందుకు సిద్ధం కావాలని తల్లిదండ్రులు చెప్పడంతో అందుకు ఇష్టంలేని ఓ బాలుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ కె.బాలరాజు కథనం ప్రకారం.. ఏపీలోని కడప జిల్లా పోరుమామిళ్ల మండలం, అక్కలరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఓ కుటుంబం 15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి గౌలిదొడ్డిలో నివాసం ఉంటోంది. కుటుంబ పెద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తోండగా.. ఆయన కుమారుడు (14) చందానగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా క్రిస్మస్ సెలవులు ముగిసినా బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు సోమవారం నుంచి బడికి వెళ్లేందుకు బ్యాగు సర్దుకుని సిద్ధం కావాలని కుమారుడికి చెప్పారు. ఈ క్రమంలో తల్లి ఇంటి బయట పనిలో నిమగ్నమవగా బాలుడు లోపల ఇంట్లోని రేకుల పైకప్పు రాడ్డునకు ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత తల్లి వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. తండ్రి ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆ 17 మంది లొంగిపోతే
## మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ: డీజీపీ




హైదరాబాద్: ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ వాళ్లు 17 మంది ఉన్నారని, వారంతా లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 17 మందిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితోపాటు మరొకరు ఉన్నారని వెల్లడించారు. వారిలో ఐదుగురు మహిళలున్నట్లు తెలిపారు. 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.25 కోట్ల రివార్డు ఉందన్నారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ కగార్ గడువులోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రం అవుతుందని చెప్పారు.



## కుటుంబ కలహాలతో స్వల్ప వ్యవధిలో దంపతుల ఆత్మహత్య

పటాన్ చెరు అర్బన్: కుటుంబ కలహాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. భార్యాభర్త వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ చిన్న తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన లాల్ శేఖర్ (32) తన భార్య అనూషతో కలిసి రెండేళ్లుగా ఐలాపూర్ చిన్న తండాలో దోబీ పని చేసుకుంటూ ఉండేవారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం కూడా భార్యాభర్త మధ్య గొడవ జరిగింది. దీంతో అనూష సమీపంలో ఉండే తల్లిగారింటికి వెళ్లిపోయింది. సోమవారం తన పుట్టింట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త లాల్ శేఖర్ వెళ్లి తలుపు పగలగొట్టి వెళ్లి చూడగా అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. దీంతో తనకు ఏం జరుగుతుందోనని ఆందోళనతో తానుండే ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాల్ శేఖర్, అనూష మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## "పోలవరం-నల్లమల"ను
## అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నాం

**: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్: పోలవరం నల్లమల సాగర్‌ను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చూపిస్తున్న లేఖకు దీనికి సంబంధం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరంనల్లమల.. ఇంటర్‌స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)కు లేఖ రాసినట్టు చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "మా అభిప్రాయంతో జీఆర్ఎంబీ కూడా సమర్థించింది. పోలవరంనల్లమల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తోంది. సుప్రీంకోర్టులో వాదనలు బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సూచించాం. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. రిట్ పిటిషన్‌లో కాదు, సూట్ పిటిషన్‌లో రావాలని మాకు సుప్రీంకోర్టు సూచించింది. వచ్చే విచారణకు నేను స్వయంగా హాజరవుతా. ఈ కేసులో స్టే ఇవ్వాలని కోర్టును కోరుతాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగింది. గతంలో ఆగి ఉంటే భారాస ప్రభుత్వం ఎందుకు చెప్పలేదు? అతి తెలివితో భారాస తెలంగాణకు భారీ నష్టం చేసింది. పాలమూరు రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం తెచ్చారు"అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## అది స్పీకర్ పరిధిలోని అంశం

**: భట్టి విక్రమార్క**

హైదరాబాద్: బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో



ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. నదీ జలాలపై చర్చ సమయంలో సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సభాహక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# దేవుడినీ వదిలిపెట్టలేదు: శబరిమల కేసులో సుప్రీం వ్యాఖ్యలు

శబరిమల బంగారం తాపడాల కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుడినీ వదిలిపెట్టలేదంటూ ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను కొట్టివేసింది. కనీసం దేవుడు, ఆలయం జోలికివెళ్లకుండా ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో శంకర్‌దాస్ కూడా బాధ్యులేనని పేర్కొంది. కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం అదృశ్యం వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోంది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ (విద్యుత్ సాయంతో బంగారు పూత పూయడం) కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని కేరళ హైకోర్టుకు సిట్ వెల్లడించింది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి దానిని ప్రైవేటుగా మళ్లించాడని ఆరోపించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు ఇప్పటికే బంగారం అప్పగించాడు. ఈ కేసు విచారణలో భాగంగా గతంలో బోర్డు



మాజీ సభ్యుడు శంకర్‌దాస్‌పై కేరళ హైకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. నేరపూరిత కుట్ర ఆరోపణల నుంచి తప్పించుకోలేరని మండిపడింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న తీవ్ర వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ తాజాగా అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇక ఈ కేసులో దర్యాప్తు పూర్తిచేయడానికి సిట్‌కు కేరళ హైకోర్టు మరో ఆరువారాల గడువు ఇచ్చింది. జనవరి 19న ప్రత్యేక దర్యాప్తు బృందం మధ్యంతర నివేదికను న్యాయస్థానానికి సమర్పించనుంది.

## కాలుష్యంపై పోరుకు 'సముద్ర ప్రతాప్'.. ప్రారంభించిన రాజ్‌నాథ్‌సింగ్




'సముద్ర ప్రతాప్ నౌకను సోమవారం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జలప్రవేశం చేయించారు. గోవా షిప్‌యార్డ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీనిని ఇప్పటికే భారత తీరగస్తీ దళానికి (ఇండియన్ కోస్ట్‌గార్డ్) అప్పగించిన సంగతి తెలిసిందే. కాలుష్య నియంత్రణకు ఉపయోగపడేలా గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించింది. సముద్ర జలాల్లో కాలుష్యాన్ని.. ముఖ్యంగా చమురు వ్యర్థాలను నిర్మూలించి జలచరాలను కాపాడేందుకు దోహదపడే అధునాతన సాంకేతికత ఇందులో ఉంది. "ఈ నౌక మన సంకల్పానికి నిదర్శనం. సాగరాల్లో కాలుష్య నియంత్రణపై దృష్టి సారించి దీనిని తీర్చిదిద్దారు. దీంతోపాటు తీర గస్తీ, సముద్ర భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నాను. ఇందులో 60 శాతానికిపైగా స్వదేశీ పరికరాలను వినియోగించాం. దేశ స్వావలంబన దిశగా ఇదొక కీలక ముందడుగు" అని రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

## లాలూ పిటిషన్‌పై సీబీఐకి దిల్లీ హైకోర్టు నోటీసులు

దిల్లీ: ఐఆర్‌సీటీసీ కుంభకోణం కేసులో ఆర్జేడీ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రస్తుత దశలో ఈ కేసు దర్యాప్తుపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, లాలూ వాదనపై సీబీఐ వివరణ లేకుండా విచారణలో ముందుకెళ్లలేమని పేర్కొంది. ఈ క్రమంలోనే లాలూ పిటిషన్‌పై సమగ్ర వివరణ ఇవ్వాలని సీబీఐకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా



ఉన్న సమయంలో ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూ యాదవ్ ఓ బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సీబీఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో లాలూ, ఆయన భార్య రబ్రీదేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌తో పాటు మరో 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీంతో మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద ట్రయల్ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు మోపింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ లాలూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

## క్షతగాత్రుడికి చికిత్స చేసిన పారిశుద్ధ్య కార్మికురాలు.. ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

చికిత్స కోసం వచ్చిన వ్యక్తికి వైద్యులకు బదులు పారిశుద్ధ్య కార్మికురాలు వైద్యం చేసిన ఘటన తమిళనాడులోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో వెలుగులోకి వచ్చింది. అయితే.. ఆ సమయంలో డాక్టర్, నర్సులు డ్యూటీలో ఉండటం గమనార్హం. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణిపేట జిల్లాలోని కలవాయి ప్రాంతంలో ఆదివారం జరిగిన ఓ ప్రమాదంలో రాజేంద్రన్ అనే వ్యక్తి గాయపడ్డాడు. చికిత్స కోసం స్థానికుల సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు, నర్సులు విధుల్లో ఉన్నప్పటికీ.. ఆస్పత్రిలో పని చేస్తోన్న పారిశుద్ధ్య కార్మికురాలు కలైసెల్వి అతడికి చికిత్స చేసి, గాయాలకు కుట్లు వేసింది. ఘటనా స్థలంలో ఉన్న ఓ వ్యక్తి ఈ వ్యవహారాన్ని వీడియో తీసి, సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత, వైద్యుల నిర్లక్ష్యం, భద్రత వంటి విషయాలపై నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేశారు. సదరు వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




దీనిపై తమిళనాడు వైద్య సేవల సంయుక్త డైరెక్టర్ తీర్థలింగం స్పందిస్తూ..నిబంధనలకు విరుద్ధంగా పారిశుద్ధ్య కార్మికురాలు వైద్యం చేయడంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలోని వైద్యులపైనా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అస్సాంలో భూకంపం.. తీవ్రత 5.1గా నమోదు

గువాహటి: ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, త్రిపురలోని వివిధ ప్రాంతాల్లో భూకంపం సంభవించింది. అస్సాంలోని మోరిగావ్‌లో భూ ప్రకంపనల తీవ్రత 5.1గా నమోదు కాగా.. త్రిపురలోని గోమతిలో 3.9గా నమోదైంది. మోరిగావ్‌కు 50కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని ప్రభావంతో మేఘాలయలో కూడా వివిధ చోట్ల స్వల్పంగా భూమి కంపించింది.



## అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య కేసు.. తమిళనాడులో అనుమానితుడి అరెస్ట్..!

అమెరికాలో హైదరాబాద్ యువతి గోడిశాల నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతడిపై అమెరికా పోలీసులు అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. 27 ఏళ్ల నిఖిత మేరీల్యాండ్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. డిసెంబరు 31 నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అమెరికా పోలీసులు తెలిపారు. అర్జున్ శర్మనే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, నిఖిత



అదృశ్యంపై జనవరి 2న అర్జున్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. అదే రోజున అతడు భారత్‌కు తిరిగి వచ్చినట్లు అమెరికా పోలీసులు గుర్తించారు. అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అర్జున్ శర్మ ఆచూకీ కోసం యూఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత అధికారులతో సంప్రదింపులు జరిపాయి. ఈ క్రమంలో నిఘా అధికారుల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో ఇంటర్‌పోల్ పోలీసులు తమిళనాడులో అనుమానితుడిని అరెస్ట్ చేశారు. అతడిని అమెరికాకు అప్పగించేందుకు అధికారిక ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

**అతడు మజీ బాయ్‌ఫ్రెండ్ కాదు..**

నిఖిత మృతి వార్త తెలియగానే ఆమె తండ్రి ఆనంద్ కన్నీరుమున్నీరయ్యారు. తన కుమార్తె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేయాలని అభ్యర్థించారు. ఇక, మీడియాలో వస్తున్నట్లుగా అనుమానితుడు అర్జున్ శర్మ.. తన కుమార్తె మాజీ బాయ్‌ఫ్రెండ్ కాదని తెలిపారు. అతడు చాలా మంది నుంచి అప్పులు తీసుకున్నట్లు చెప్పారు.



## పుదుచ్చేరి 'లేడీ సింగం' బదిలీ

లేడీ సింగంగా సోషల్ మీడియాలో వైరలైన ఐపీఎస్ అధికారిణి ఇషా సింగ్ బదిలీ అయ్యారు. ఆమెను పుదుచ్చేరి నుంచి దిల్లీకి బదిలీ చేస్తూ.. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల కేడర్‌కు చెందిన మొత్తం ఏడుగురు ఐపీఎస్‌లు దిల్లీకి బదిలీ అయ్యారు. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌తో వివాదం నేపథ్యంలో ఇషా సింగ్ పేరు వైరలైంది. గతేడాది సెప్టెంబర్‌లో టీవీకే చీఫ్ విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం పుదుచ్చేరిలో నిర్వహించిన మరో బహిరంగ కార్యక్రమంలో పోలీసులు ప్రజల హాజరుపై కఠిన ఆంక్షలు విధించారు. కాగా వేదిక వద్దకు విజయ్ చేరుకున్న అనంతరం టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ వేదిక వద్ద స్థలం ఉందని.. లోపలికి రావాలని మైకులో ప్రజలకు సూచించారు. దీంతో అక్కడే ఉన్న ఐపీఎస్ అధికారిణి ఇషా సింగ్ ఆయన నుంచి మైకు లాక్కొన్నారు. "కరూర్ తొక్కిసలాటలో 41 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని అప్పుడే మరిచిపోయారా? ఎందుకు ఎక్కువమంది ప్రజలను వేదిక వద్దకు రమ్మని పిలుస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో టీవీకే నేత తీరుపై నెటిజన్లు విమర్శలు వ్యక్తంచేశారు. జన సమీకరణ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఐపీఎస్ అధికారిణి చూపిన ధైర్యాన్ని కొనియాడుతూ.. ఆమెను లేడీ సింగంగా అభివర్ణించారు.

## దిల్లీ అల్లర్ల కేసు.. ఉమర్ ఖాలిద్, ఇమామ్‌కు బెయిల్ నిరాకరణ

దిల్లీ: దేశ రాజధానిలో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో అరెస్టయిన ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్‌కు బెయిల్ ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అయితే, ఇదే కేసులో నిందితులైన మరో ఐదుగురికి మాత్రం సుప్రీం ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. "ఈ కుట్ర కేసులో ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ నేరానికి పాల్పడినట్లు బలమైన ఆధారాలున్నాయి. ఈ కేసులో మిగతా నిందితులతో పోలిస్తే వీరిద్దరిపై అభియోగాలు భిన్నమైనవి. ఇలాంటి దశలో వారికి బెయిల్ ఇవ్వడం సరైన నిర్ణయం కాదు" అని సుప్రీంకోర్టు వెల్లడించింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన హింసాత్మక నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ అల్లర్లలో 53 మంది దుర్మరణం చెందగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ కూడా హత్యకు గురయ్యారు. ఈ అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద ఛార్జిషీటు నమోదు చేశారు. వీరిలో కొందరికి గతంలో బెయిల్ లభించింది. ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ సహా




ఏడుగురు నిందితుల బెయిల్‌ను గతేడాది సెప్టెంబరులో దిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం డిసెంబరు 10న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఖాలిద్, ఇమామ్‌కు బెయిల్ నిరాకరిస్తూ తీర్పు వెలువరించింది. మరో ఐదుగురు నిందితులు గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రహమాన్, మహ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌కు కోర్టు ఊరట కల్పించింది.

# రికార్డు స్థాయి నుంచి జారి...

# నష్టాల్లో ముగిసిన నిఫ్టీ

**ఒడుదొడుకుల మధ్య నష్టాల్లో ముగిసిన మార్కెట్లు**

**సెన్సెక్స్ 322 పాయింట్లు, నిఫ్టీ 78 పాయింట్లు నష్టపోయిన వైనం**

**ట్రేడింగ్ మధ్యలో సరికొత్త రికార్డు స్థాయిని తాకిన నిఫ్టీ**

**ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**రియల్టీ, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు**




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఒడుదొడుకుల మధ్య నష్టాలతో ముగిశాయి. ట్రేడింగ్ ఆరంభంలో ఉత్సాహంగా కనిపించినా, అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు కిందకు జారాయి. దీనికి తోడు వెనిజులాలో అమెరికా సైనిక చర్య వంటి అంతర్జాతీయ పరిణామాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 322.39 పాయింట్లు నష్టపోయి 85,439.62 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 78.25 పాయింట్లు తగ్గి 26,250.30 వద్ద ముగిసింది. అయితే, రోజులో ఒక దశలో నిఫ్టీ 26,373.20 వద్ద సరికొత్త రికార్డు స్థాయిని తాకింది. కానీ ఆ లాభాలను నిలబెట్టుకోలేకపోయింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్‌టెక్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి ప్రధాన కంపెనీల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమైంది. మరోవైపు, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడి మార్కెట్లకు కొంత మద్దతునిచ్చాయి.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు సుమారు 1 శాతం చొప్పున నష్టపోయాయి. అయితే, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 2 శాతానికి పైగా లాభపడగా, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బ్రాడర్ మార్కెట్‌లో మిడ్‌క్యాప్ 0.16 శాతం, స్మాల్‌క్యాప్ 0.53 శాతం మేర నష్టపోయాయి.

విశ్లేషకుల అంచనా ప్రకారం, నిఫ్టీకి 26,300?26,350 స్థాయి కీలక నిరోధకంగా మారింది. దీనిని దాటితే 26,500 వరకు వెళ్లే అవకాశం ఉంది. ఒకవేళ 26,200 స్థాయిని కోల్పోతే 26,000 వరకు దిద్దుబాటు జరగవచ్చని భావిస్తున్నారు. రానున్న రోజుల్లో వెలువడనున్న కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశించనున్నాయి.

# వెనెజువెలా పరిణామాలతో...

# బంగారం, వెండి ధరల్లో భారీ జంప్

**వెనెజువెలా అధ్యక్షుడి అరెస్ట్‌తో భగ్గుమన్న బంగారం, వెండి**

**పెట్టుబడిదారుల్లో పెరిగిన సేఫ్ హెవెన్ డిమాండ్**

**సోమవారం ట్రేడింగ్‌లో భారీగా పెరిగిన పసిడి, వెండి ఫ్యూచర్స్**

**రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు కూడా ధరల పెరుగుదలకు కారణం**

**గత ఏడాదితో పోలిస్తే భారీ లాభాల్లో కొనసాగుతున్న బులియన్ మార్కెట్**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పరుగులు తీస్తున్నారు. అమెరికా బలగాలు వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకోవడంతో సోమవారం పసిడి, వెండి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ పరిణామంతో పెరిగిన 'సేఫ్ హెవెన్ డిమాండ్' బులియన్ మార్కెట్‌కు రెక్కలు తొడిగింది.

సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఓఅచీ)లో ఫిబ్రవరి నెల గోల్డ్ ఫ్యూచర్స్ 1.47 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,37,750 వద్ద ట్రేడ్ అయింది. ఇక మార్చి నెల వెండి ఫ్యూచర్స్ ఏకంగా 2.92 శాతం లాభపడి కిలోకు రూ. 2,43,223కి చేరింది. అయితే, 2025 డిసెంబర్ నాటి రికార్డు గరిష్ఠ స్థాయిల కంటే ఈ ధరలు ఇంకా తక్కువగానే ఉన్నాయి.

వెనెజువెలా పరిణామాలకు తోడు, రష్యా-ఉక్రెయిన్ శాంతి చర్చల్లో నెలకొన్న అనిశ్చితి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు కూడా పసిడి పెరుగుదలకు దోహదపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం దేశీయంగా ధరల పెరుగుదలకు మద్దతుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 1.5 శాతం పెరిగి 4,395 డాలర్లకు చేరింది.

ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ధరలు తగ్గినా, సురక్షితమైన పెట్టుబడి రూపంలో కొనుగోళ్ల మద్దతు లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. బంగారానికి రూ. 1,35,550 వద్ద మద్దతు, రూ. 1,38,150 వద్ద నిరోధం ఉందని అంచనా వేస్తున్నారు. అమెరికా నుంచి వెలువడనున్న ఉపాధి గణాంకాలు, తయారీ రంగ డేటా వంటి కీలక నివేదికల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు. ఈ నివేదికలు ఫెడ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి.

కాగా, గత క్యాలెండర్ ఏడాది (2025)లో బంగారం ధర ఏకంగా 66 శాతం పెరగ్గా, వెండి 171 శాతం వృద్ధితో దానిని మించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు భారీగా కొనుగోళ్లు జరపడం, పారిశ్రామిక కొరత వంటివి ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలిచాయి.

# ఎగుమతుల్లో సత్తా.. అమ్మకాల్లోనూ టాప్..

# భారత్‌లో యాపిల్ సరికొత్త రికార్డు!

**భారత్ నుంచి 50 బిలియన్ డాలర్ల ఐఫోన్ల ఎగుమతి**



**న్యూఢిల్లీ:** అమెరికా టెక్ దిగ్గజం యాపిల్, భారత ప్రభుత్వ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద సరికొత్త మైలురాయిని అందుకుంది. 2025 డిసెంబర్ నాటికి భారత్‌లో తయారైన ఐఫోన్ల ఎగుమతులు 50 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.15 లక్షల కోట్లు) మార్కును అధిగమించాయి. యాపిల్ ఐదేళ్ల పీఎల్ఐ గడువు ముగియడానికి ఇంకా మూడు నెలలు మిగిలి ఉండగానే ఈ ఘనత సాధించడం విశేషం.

పరిశ్రమ వర్గాల గణాంకాల ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లోనే (ఏప్రిల్-డిసెంబర్ 2025) దాదాపు 16 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను యాపిల్ ఎగుమతి చేసింది. ఇదే పథకం కింద ఐదేళ్లలో శాంసంగ్ సంస్థ సుమారు 17 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను మాత్రమే ఎగుమతి చేయడంతో పోలిస్తే, యాపిల్ వృద్ధి ఎంత వేగంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.




# ముంబై కెప్టెన్‌గా అయ్యర్..

**పునరాగమనం అదిరేనా..!**

న్యూఢిల్లీ: స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయాస్ అయ్యర్ మైదానంలోకి దిగనున్నాడు. అది కూడా కెప్టెన్‌గా. ఈమధ్యే కోలుకున్న అయ్యర్ దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీ సారథిగా ఎంపికయ్యా. వన్డే ఫార్మాట్లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో తదుపరి మ్యాచ్‌లకు అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సోమవారం ముంబై క్రికెట్ సంఘం తెలిపింది.

సిడ్నీ వన్డేలో గాయంతో ఆటకు దూరమైన శ్రేయాస్ అయ్యర్.. సర్జరీ తర్వాత వేగంగా కోలుకున్నాడు. ఇటీవలే బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ చాటుకొని న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ చాటుకుంటేనే జాతీయ జట్టుకు ఆడే అవకాశం ఉన్నందున దేశవాళీ టోర్నీలో ఆడేందుకు సిద్ధమయ్యాడీ స్టార్ బ్యాటర్. సీనియర్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ గాయపడడంతో అయ్యర్‌కు ముంబై సారథ్యం అప్పగించింది.

'ముంబై సీనియర్ టీమ్ కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ నియమితులయ్యాడనే విషయాన్ని మీతో పంచుకోవడం సంతోషంగా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై అయ్యర్ సారథ్యంలోనే తదుపరి మ్యాచ్‌లు ఆడనుంది' అని ఎంసీఏ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం గ్రూప్ సీ నుంచి రెండో స్థానంలో ఉంది. జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో, జనవరి 8న పంజాబ్‌తో ముంబై తలపడనుంది. జనవరి 11న బరోడాలో రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో, ఆపై ఛాంపియన్స్ ట్రోఫీలో మెరిసిన అయ్యర్‌ను న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు తీసుకున్నారు. రెగ్యులర్ సారథి శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేయగా.. అయ్యర్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 11న బరోడాలో జరుగనున్న తొలి వన్డేలో కివీస్‌తో టీమిండియా తలపడనుంది.

భారత వన్డే స్క్వాడ్ : శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రిషభ్ పంత్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, సిరాజ్, హర్షిత్ రానా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, నితీశ్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్.

## టీ20 ప్రపంచ కప్‌కు సిరాజ్ ఎంపిక కాకపోవడంపై

# స్పందించిన ఏబీ డివిల్లియర్స్

**సిరాజ్‌కు జట్టులో చోటు దక్కకపోవడం దురదృష్టకరమన్న డివిల్లియర్స్**

**సెలక్టర్లు ఫామ్ కంటే కూర్పుకు ప్రాధాన్యత ఇచ్చారన్న డివిల్లియర్స్**

**హర్షిత్ రాణా బ్యాటింగ్ కూడా చేయగలడని అందుకే జట్టులోకి తీసుకుని ఉంటారని వెల్లడి**



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్-2026లో పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే. ఈ అంశంపై దక్షిణాఫ్రికా మాజీ సారథి ఏబీ డివిల్లియర్స్ స్పందించాడు. సిరాజ్‌కు ప్రపంచ కప్ జట్టులో స్థానం లభించకపోవడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డాడు. సెలక్టర్లు ఆటగాళ్ల ఫామ్ కంటే జట్టు కూర్పుపైనే అధికంగా దృష్టి సారించినట్లుగా ఉందని పేర్కొన్నాడు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

సిరాజ్ వన్డే జట్టులో స్థానం సంపాదించుకున్నాడని, కానీ దురదృష్టవశాత్తూ టీ20 ప్రపంచకప్‌కు ఎంపిక కాలేకపోయాడని అన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఎంపికయ్యారని, హర్షిత్ రాణా బ్యాటింగ్ కూడా చేయగలడని తెలిపాడు. అందుకే సెలక్టర్లు అతడిని జట్టులోకి తీసుకున్నట్టు అర్థమవుతోందని చెప్పాడు. సీమ్ బౌలర్లతో పాటు స్పిన్నర్లపై కూడా సెలక్టర్లు దృష్టి సారించినట్లు చెప్పాడు. ఒకవేళ వారు సీమర్లతో పాటు వికెట్లు సాధిస్తే అది అదనపు ప్రయోజనమని అభిప్రాయపడ్డాడు.

కాగా, సిరాజ్ 2024 జులైలో టీమిండియా తరపున చివరి టీ20 మ్యాచ్ ఆడాడు. అయితే, సిరాజ్ జనవరి 11 నుంచి న్యూజిలాండ్ తో జరగనున్న వన్డే సిరీస్‌లో పాల్గొననున్నాడు.

ఏబీ డివిల్లియర్స్, సిరాజ్ గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించారు.

# రికీ పాంటింగ్ రికార్డు సమం..

**క్రికెట్ దిగ్గజం సచిన్‌కు చేరువగా జో రూట్!**

**సిడ్నీ:** 2025-26 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ మాస్టర్ బ్యాట్స్‌మన్ జో రూట్ మరోసారి సత్తాచాటాడు. సిడ్నీలో జరుగుతున్న ఐదో టెస్టులో రూట్ అద్భుత శతకం బాదాడు. మైకేల్ నెసర్ వేసిన బంతికి రెండు పరుగులు తీసి.. సెంచరీ పూర్తి చేశాడు. ఈ సిరీస్‌లో ఇది అతడికి రెండో సెంచరీ కాగా.. టెస్టు క్రికెట్‌లో మొత్తం 41వ సెంచరీ. ఈ క్రమంలో ఆస్ట్రేలియా లెజెండ్ రికీ పాంటింగ్ సరసన నిలిచి.. ఆల్‌టైమ్ టెస్టు సెంచరీల జాబితాలో మూడో స్థానాన్ని పంచుకున్నాడు. ఈ యాషెస్ సిరీస్‌లో జో రూట్‌కు ఇది రెండో సెంచరీ. అంతకుముందు బ్రిస్బేన్‌లో జరిగిన డే-నైట్ టెస్టులో అజేయంగా 138 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా గడ్డపై గత మూడు యాషెస్ పర్యటనల్లో రూట్ సెంచరీ చేయని విషయం తెలిసిందే. చివరకు ఆసీస్ గడ్డపై సెంచరీ కరువు తీర్చుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో రూట్ మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మొదటి స్థానంలో ఉన్నాడు. 200 మ్యాచుల్లో 51 సెంచరీలు బాదాడు. దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వస్ కలీస్ 166 మ్యాచుల్లో 45 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. 35 ఏళ్ల రూట్ త్వరలోనే కలీస్ రికార్డును బద్దలు కొట్టనున్నాడు. రూట్ ఇంకా 3-4 ఏళ్లు ఆడే అవకాశాలు ఉన్నాయి. క్రికెట్ దిగ్గజం సచిన్‌కు చేరువగా లేదా బద్దలు కొట్టే అవకాశాలు లేకపోలేదు.




# ముస్తాఫిజుర్ ఎఫెక్ట్..

# బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ బ్యాన్..

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి నేపథ్యంలో భారత్-బంగ్లా మధ్య వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ టీం నుంచి బంగ్లా ఆటగాడు ముస్తాఫిజుర్ ను తొలగించాలని బీసీసీఐ ఆదేశించింది. దీంతో బంగ్లా-భారత్ మధ్య సంబంధాలు మరింత దిగజారుతున్నాయి. ముస్తాఫిజుర్ ను తొలగించినందుకు నిరసనగా.. బంగ్లాదేశ్ లో ఐపీఎల్ పై నిషేధం విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది.

దీని ప్రకారం దేశంలో ఐపీఎల్ ప్రసారాలతోపాటు, ప్రచారం కూడా చేయకూడదు. ఈ మేరకు బంగ్లా ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇటీవల మినీ వేలంలో ముస్తాఫిజుర్ ను కోల్‌కతా జట్టు రూ.9.2 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో దేశవ్యాప్తంగా పలువురు కేకేఆర్, బీసీసీఐపై విమర్శలు చేశారు. ఒక పక్క బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు జరుగుతుంటే.. ఆ దేశానికి చెందిన




క్రీడాకారుడిని ఐపీఎల్ టీంలోకి తీసుకోవడంపై సోషల్ మీడియా వేదికగా పలువురు విమర్శించారు. దీంతో స్పందించిన బీసీసీఐ అతడిని తొలగించాలని కేకేఆర్ కు ఆదేశాలు జారీ చేసింది. అతడి స్థానంలో మరొకరిని తీసుకునేందుకు అనుమతిస్తామని చెప్పింది. దీంతో ముస్తాఫిజుర్ ను కేకేఆర్ విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది.

దీనిపై బంగ్లా క్రికెట్ బోర్డ్ (బీసీబీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. బీసీసీఐ నిర్ణయం బంగ్లా ప్రజల్ని ఆగ్రహానికి, విస్మయానికి గురి చేసిందని తెలిపింది. ఇలా చేస్తే.. ఇండియాలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ లు తమ జట్టు పాల్గొనబోదని, తమ జట్టు ఆడే మ్యాచుల వేదికలు ఇండియా నుంచి మార్చాలని ఐసీసీని కోరింది. తమ క్రికెటర్ల భద్రత రీత్యా తమ ఆటగాళ్లను ఇండియా పంపించకూడదని నిర్ణయించుకున్నట్లు బీసీబీ తెలిపింది. ఈ అంశంపై త్వరలోనే ఐసీసీ చర్చించనుంది. ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్.. ఇండియాలో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఒకవేళ బీసీబీ కోరినట్లు ఇండియా నుంచి వేదికలు మారిస్తే.. శ్రీలంకలో ఆడే ఛాన్స్ ఉంది.

# విదేశాల్లో ది రాజాసాబ్ మేనియా

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల అమ్మకాలు

**టాకీస్:** ప్రభాస్ హీరోగా,దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకి సంబంధించిన సంకేతాలు ఇస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి విదేశీ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు బలంగా ప్రారంభమయ్యాయి. ప్రభాస్ క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా, ఉత్తర అమెరికాలో ఇప్పటివరకు 17,500కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే యూకే మార్కెట్‌లో కూడా 17,500కు పైగా ప్రీ-సేల్స్ నమోదు కావడం విశేషం. 2026 జనవరి 8న ప్రారంభమయ్యే ప్రీమియర్ షోలకే ఇంత భారీ స్పందన రావడం, సినిమా ఓవర్సీస్‌లో బలమైన ఓపెనింగ్ రాబోతుందనే సంకేతాలను ఇస్తోంది. దర్శకుడు మారుతి ఈ సినిమాను దాదాపు మూడేళ్ల పాటు శ్రమించి తెరకెక్కించినట్టు సమాచారం. పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్‌ను సరికొత్తగా చూపించాలనే లక్ష్యంతో ఈ సినిమా రూపొందించబడింది. 'బాహుబలి', 'సలార్' లాంటి ఇంటెన్స్ పాత్రల తర్వాత ప్రభాస్‌ను లైట్ హార్టెడ్, ఫుల్ ఎంటర్‌టైనర్‌లో చూడాలన్న అభిమానుల ఆశలను 'ది రాజాసాబ్' తీర్చబోతుందనే అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ది రాజాసాబ్' సినిమాను తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రభాస్‌కు ఉన్న మార్కెట్‌ను పూర్తిగా వినియోగించుకునేలా మేకర్స్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతోనే ఓవర్సీస్‌లో హీట్ పెంచుతున్న 'ది రాజాసాబ్'? సంక్రాంతి రేసులో పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.





# మృణాల్ ఠాకూర్‌ను హైదరాబాద్ పిలుస్తోందట..



టాకీస్: టాలీవుడ్ హీరో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో డెకాయిట్ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే. షనీల్ డియో కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి క్రేజీ అప్‌డేట్ షేర్ చేసింది మృణాళ్ ఠాకూర్. డెకాయిట్ ఫైనల్ షెడ్యూల్ పూర్తి చేసేందుకు తాను హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఈ పోర్షన్‌తో మృణాళ్ ఠాకూర్‌కు సంబంధించిన పార్ట్ పూర్తి కానుంది. హైదరాబాద్ పిలుస్తోంది.. అంటూ మృణాళ్ ఠాకూర్ షేర్ చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రకాశ్ రాజ్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు.

డెకాయిట్ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌పై సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తోంది.

# ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్

**టాకీస్:** జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉ



దాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది.

# అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

## లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్

**టాకీస్:** టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్



ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం.

# కాంతార బ్యూటీకి మరో తెలుగు ఛాన్స్..

టాకీస్: ప్రజెంట్ ఇండస్ట్రీలో బాగా వినపడతున్న పేరులో రుక్మిణీ వసంత్ ఇకరు. కన్నడ చిత్రం 'సప్త సాగరదాచె ఎల్లో'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. తన అందం నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఇక రీసెంట్‌గా 'కాంతార: చాప్టర్ 1'లో కనకవతిగా సెన్సేషన్ సృష్టించిన రుక్మిణీ వసంత్ టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకుంటోంది. ఇప్పటికే ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాతో ఎంట్రీ ఇస్తున్న ఈ భామ, ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ సరసన మరో క్రేజీ ఆఫర్ కొట్టేసింది. సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో రుక్మిణి హీరోయిన్‌గా ఎంపికైనట్లు తెలుస్తోంది. తన అందం, అభినయంతో ఇప్పటికే కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన ఈ బ్యూటీ, శర్వానంద్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక, ఈ సినిమా కథ విషయానికి వస్తే, తెలియని వయసులో ఆవేశంగా చేసిన ఒక పని వల్ల హీరో జీవితంలో ఎలాంటి డ్రామా చోటుచేసుకుందనే ఆసక్తికర పాయింట్‌తో శ్రీను వైట్ల ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. 'విశ్వం' తర్వాత ఎలాగైనా ఒక హిట్ అందుకోవాలనే పట్టుదలతో ఉన్న ఆయన, ఈ సినిమాలో ఒక సీనియర్ హీరోను కూడా ఒక కీలక పాత్ర కోసం తీసుకుంటున్నట్టు సమాచారం. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చి నుంచి ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తుండటం, శ్రీను వైట్ల మార్క్ కామెడీతో కూడిన డ్రామా ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొన్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.